

# రంగడి పల్లె రాముడు

కన్నడ మూలం: మాస్తి వెంకటేశ అయ్యంగార్
(శ్రీనివాస)

అనువాదం: శర్వాణి

కోర్ట్నె సాహేబుగారి డైరీలో మనుమత్తి సంగతి తరువాత, ఫర్కువరుడిని గురించి మరో సంగతుంది. ఫర్కువరడు ఈ దేశ సంస్కృతిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో ఏ రీతిగా సాయపడ్డాడో చెప్పడమే దాని ఉద్దేశం. ఆ ఉదంతాన్నే ఇక్కడ ఇచ్చాను.

## 2

మనుమత్తినుంచి తిరిగి వచ్చాక మేము అదీ ఇదీ మాట్లాడుతూ కూర్చుని ఉండగా ఎమిలీ భర్తతో. "నువ్వు ఈ దేశానికి సేవ చేయడమే నిజమయితే ఆ దేవాలయాన్ని ఉద్ధరించావు కదా... అలాంటి వేమయినా చెయ్యి. అదే నిజమైన సేవ, నిజమైన ప్రచారం" అంది.

ఫర్కువరుడు- "అదీ నిజమే" అని ఆమెకు బదులు చెప్పి,నావేపు తిరిగి- "ఎమిలీ చెబుతున్నది నా పరిశోధనలో బహు సుందరమైన ప్రకరణం. దాన్ని గురించి అప్పుడు నీకు రాసిన ఉత్తరంలో సూక్ష్మంగా తెలిపాను కదా! ఇప్పుడు వివరంగా చెప్పనా?" అన్నాడు.

నేను- "అవునవును. కొంత గుర్తుంది. చెప్పనా అని అడగాలా? తప్పక చెప్పాలి" అన్నాను.

అతడు చెప్పిన ప్రకారం —

## 3

ప్రాచ్య సంస్కృతి పరిశోధనా కార్యక్రమంలో ఫర్కువరుడి బుద్ధి అదీ ఇదీ అని కాకుండా అన్ని విషయాల్లోనూ ఒక్కరీతిగానే పనిచేస్తుండేది. ఈ దేశపు కట్టడాలు, వాస్తు శిల్పం, వాటిలోని చిత్రాలు, వాటి లక్షణాలు- అందులోని సంకేతాలు, సూచిస్తున్న భావాలు, అంతరార్థాలు, దేవాలయాల్లో కనిపించే చిత్రాలు, బయటి చిత్రకారుల దగ్గర దొరికే పుస్తకాలు, పుస్తకాల అంచున గీసిన చిత్ర లిపి, ఇక్కడి సంగీతం, దానిలో ఉత్తర-దక్షిణ భేదాలు, నాగరికుల భావగీతాలు, పల్లె పాటలు, రాజనర్తకుల శాస్త్రీయ నృత్యాలు, పల్లె పదాలు, కోలాటాలు—ఇవన్నీ కూడా అతని పరిశీలనా క్షేత్రం లోనివే. కనుక అతను ఏ ఊరు వెళ్ళినా అతని అన్వేషణకు ఏదో ఒకటి దొరక్కపోదు.

ఎలాంటి ఊరైనా సరే, మరేమి లేకపోయినా ఓ శిథిలమైన దేవాలయం ఉండనే ఉంటుంది. అదీ లేని చోట ఏ ముసలమ్మో పాడిన పాతకాలపు పాట ఉంటుంది. ఒక్కోసారి శిథిల దేవాలయం ఇటీవలి దేవాలయంలా కనిపించవచ్చు. లేదా ముసలమ్మ పాడిన పాట ఇటీవలి కట్టుకథ కావచ్చు ఏది ఏమైనా ఆలోచించడానికొక విషయం దొరికినట్లయ్యేది. ఫర్కువరుడు అలాంటి విషయాన్ని పరిశీలించి చూసి అప్పటికి సరి అనిపించిన నిర్ణయానికి వచ్చేవాడు. ఈ పనిలో నిర్ణయం ముఖ్యం కాదు. పరిశీలనా క్రమమే ముఖ్యం. అందులో తప్పటడుగు వెయ్యకపోవడమే సంతోషం. చాలాసార్లు అన్వేషణ ఆ రకంగా ఉంటూ ఒక్కోసారి అనూహ్యమైన తీరుతో రసవత్తర మవుతుంది. ఈ ఉదంతం అలాంటి వాటిల్లో ఒకటి.

## 4

బయలుసీమ, మలెనాడు కలిసే చోట రాజవంతి అనే ఊళ్ళో ఫర్కువరుడు కొన్ని కోలాటం పాటలు విన్నాడు. పాటల్లో చాలా మటుకు ఇంతకుముందే విన్న పాటలు. రెండో, మూడో కొత్తవి. అందులో రెండు పాటలు మాటల్లో కొత్తవైనా,తీరులో కొత్తవేం కాదు. ఒక పాటమాత్రం తీరులోకూడా కొత్తగానే ఉంది. అంతేకాక అందులో మరో విశేషం-పిల్లలు దాగుడుమూతలాడే పాటను తీసుకుని కొత్తమలుపు తిప్పి పెంచారు. దాని పల్లవి- "కళ్ళుమూసిన కాడూగోడ (అడవి గోడ). రంగడిపల్లె రాముడి పాట" అని ఉంది. కోలాటకారులు వాడుక మేరకు ఒక్కొక్క ద్విపదనీ రెండు రెండు సార్లు పాడుతూ కోలాటం వేశారు. పాట పల్లవి దాగుడుమూ తల ఆటలో పిల్లలు వాడుకగా చెప్పుకునేది. ఆ తరువాత నుంచీ విషయం కొత్తది. దాన్ని వినగానే ఫర్కువరుడికి ఇక్కడేదో విషయం ఉందనిపించింది. అతడు దాన్ని మరీ శ్రద్ధగా విన్నాడు. ఎంత శ్రద్ధగా విన్నా,కోలాటం సందడిలో మాటలు అంత స్పష్టంగా తెలియడం కష్టం. కోలాటం అయ్యాక ఫర్కువరుడు ఆడగాళ్ళ ప్రధాన వ్యక్తిని కూర్చోబెట్టుకుని ఊళ్ళోని ప్రాతగాడి చేత ఆ మాటల్ని వరుస క్రమంలో రాయించాడు. అది మొత్తంమీద ఇలా ఉంది—

"కళ్ళుమూసిన అడవీ గోడ
రంగడి పల్లె రాముడి పాట
రంగడి పల్లె రాముడు ఏడి?
పారే ఏటి కుడిగట్టూ
గట్టూ పక్కన మామిడిచెట్టు
మామిడి చెట్టూ ముంగరవళ్ళి
ముంగరవళ్ళి మూసిన కోడు
కోడూ ఎక్కి తూర్పున చూడు
తూరుపు దిక్కున రంగడి జాడ
రాముడూ అక్కడే ఉంటాడు జాణా

రంగడే రాముడు రాముడే రంగడు
ఇద్దరు ఒకటే అయినారు వేరు
ఒక్కడే ఇద్దరై మరుగాయె రాముడు
తెర దించినాడు °సిరిరంగధాముడు
అడవీ గోడ మూ °సిన కళ్ళు
మరుగైన రాముడిని మురిపించి పాడు
మూ °సిన కన్నులు తెరచీ అప్పుడు
మినుముల మూ ట పార్లినప్పుడూ
పార్లినప్పుడూ కన్నులు తెరచును
తెరవక మునుపే పరాయి పక్షులు
కకావికలై ఎగరాలి తొలగాలి
తొలగిననాడు మన కానందం
పరాయి పక్షులు తొలగిననాడు
మన ఊరి పక్షులు కలకల మనిన
చీకటి తొలగీ వేకువ విరి °సె
మూ °సిన కళ్ళూ తెరిపించు రంగా
ఉన్నాడు అక్కడే అందాల రాముడు
పండిన నవ్వుల వెన్నెల చల్లి
కళ్ళూ మూ °సె అడవీ గోడ
రంగడి పల్లె రాముడి పాట."

మళ్ళీ మళ్ళీ వల్లించే పదాలు విడచి.ఉన్న పాటని ఉన్నట్టుగా రా స్తే.పాటలో కొంత స్పష్టమైన అర్థం కనిపించింది ఫర్కువరుడికి.

ఆ పదాల్ని కూర్చినవాడెవరో పల్లెటూరి పాటగాడు. రంగడిపల్లెలోని పల్లెవాడే కావచ్చు. తన ఊరి రాముణ్ణి పొగడుతున్నాడు. రాముడు ఆ ఊరి దేవుడయి ఉండవచ్చు. దాన్తోబాటే రంగడనే పేరునికూడా చేరుస్తున్నాడు కాబట్టి ఆ మూ ర్తికి ఆ పేరుకూడా ఉందేమో అనుకోవచ్చు. దేవుడు ఉన్న మందిరాన్ని. దాని చుట్టూ ఉన్న తోపుని. నదిని కవి వర్ణించాడు కాని.అతడి ఉద్దేశమేమిటో సరిగ్గా వ్యక్తం కాలేదు. రాముడు.రంగడు-రెండూవిష్ణువు రూపాలే. రూపాలు రెండయినా.దేవుడు ఒక్కడే అని చెప్పడమే కవి ఉద్దేశం కావచ్చు కాని.శబ్దం దాన్ని ఒకటిగా భావించవద్దు అన్నట్టుంఒదే! దీన్ని చెప్పడంలోనే ఏదైనా తప్పు ఉండొచ్చు. మేధ్యలో మరియాదె (మరుగాయె) రామ అన్న మాట ఉండడంతో ఇది ఇక్కడి చరిత్రలోని మర్యాద రామన్నను గురించినదైనా కావచ్చు.

"ఈ పాట ఏ ఊరిది?" అని అడిగాడు ఫర్కువరుడు.

దాన్ని ఈ చుట్టుపక్కల అందరూ పాడతారని. కాని బహుశః అది రంగడిపల్లె వాళ్ళు కట్టిన పాట కావచ్చుననీ ఆ జనం చెప్పారు.

రంగడిపల్లె అక్కణ్ణుంచి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లె. అక్కడ రంగనాథుడి దేవాలయం ఒకటుంది. దాన్నే రామదేవుడి గుడి అనికూడా పిలుస్తారు. కాని.విడిగా రాములవారి మూ ర్తి లే దక్కడ. దేవస్థానం గురించి పూర్వకాలం వాళ్ళేదో స్థలపురాణం చెప్పేవారు కాని.ఇప్పటి వాళ్ళ కదేమీ తెలియదు.

ఇదంతా విన్నాక ఫర్కువరుడికి అనిపించింది- రంగడిపల్లెలో తనకేదో అన్వేషణ కార్యక్రమం ఉందని. పిల్లల ఆటకోసం కట్టిన ఆ పాటలో పాట వ్రా °సిన వాడు ఏదో రహస్యాన్ని చెప్పడానికి ప్రయత్నించా డనిపించిం దతడికి. అతడు మర్నాడే రంగడిపల్లెకి ప్రయాణమై వెళ్ళాడు.


రంగడిపల్లె ఇప్పుడు చిన్న పల్లె. రెండువందల ఏళ్ళ క్రిందట అది మంచి °స్థితిలో ఉండవచ్చు. ఇప్పు డా పాత నివేశనం పూర్తిగా పాడుబడింది. గ్రామమొత్తం వి °స్తర్ణంలోని మరోభాగంలో కొత్త ఊరొకటి వెల °సె దాన్ని రంగడిపల్లె అనీ. రంగడిపల్లె కొత్తూరనీ పిలుస్తారు. పాతగ్రామం ఒక నది పక్కనే ఉండేది. కొత్తూరు కాస్త ఎత్తుగా ఉన్న గుట్టమీద ఉంది. నది అనడంకంటే ఏరు లేదా వాగు అన్న వర్ణన సరిపోతుందేమో! ఈ ఏటిని ఇక్కడి జనం 'యగచి' అంటారు. కొంతమంది ఇదే హేమవతి. నిజమైన హేమవతి అని చెబుతారు. చదువు. వ్రాతా తెలి °సిన జనం దీన్ని నది అంటారేగాని.ఏరు అనరు. ఏరు అంటే నదికన్న చిన్నదని ఒప్పుకుని తమ గొప్పతనం తక్కువ చేసుకొంటామేమోనని వాళ్ళకి భయం


ఫర్కువరుడికి తను ఆంగ్లేయ అధికారిలా కనిపించాలన్న అభిలాష లేదు. అతడు ఈ ప్రయాణాలన్నీ ఒంటరిగానే చే సేవాడు. మా లాంటి అధికారులు సాయం చేస్తామన్నా. దాన్ని ఆశించడు. శుభ్రంగా ఉన్న ఏ చోటనైనా నివ °సించే వాడు. అప్పుడు పండిన పదార్థం ఏదైనా సరే పల్లెవాళ్ళు పెట్టినది సంతోషంగా తినేవాడు. అతడు రాజవంతి నుండి ఒక మనిషిని తోడు తీసుకుని రంగడిపల్లె చేరుకున్నాడు.

ఆ గ్రామపెద్దని పిలిపించి తను వచ్చిన పని గురించి వినయంతో. సౌమ్యంగా వివరించాడు. తోడుగా వచ్చిన ఆ మనిషి ఫర్కువరుడి గురించి మంచిగా చెబుతూ. అతని పనిలో సాయపడటం మంచిదేనని కరణంగారు కబురు పెట్టిన సంగతి చెప్పాడు.

గ్రామ పెద్ద రామప్ప. "ఇంతగా చెప్పాలా? ఆయన రావడం ఎక్కువా? మేం సేవచేయడం ఎక్కువా? ఆయన చెప్పిన పనిని శిరసా వహించి చేస్తాము" అన్నాడు.

ఫర్కువరుడు ఆ మనిషి నడవడికను మెచ్చుకున్నాడు. రామప్ప ధనవంతు డేమీ కాదు. పెద్ద చదువుకోనూ లేదు. కాని.చెప్పుకో దగిన ఆత్మగౌరవం కలవాడు. వేలాది ఏళ్ళ సంస్కార ఫలం కాకపోతే ఇలా నుంచోఫడం. మాట్లాడ్డం రాదని ఫర్కువరుడి వాదం. పైబట్ట కప్పుకుని తన ఎదుట నించున్న రామప్పను చూస్తుంటే ఫర్కువరుడికి రోమనుల మూ ర్తి ఒకటి తన ఎదుటకి






వచ్చినట్లయింది. ఫర్కువరుడికి ఆ రోజు అక్కడే ఉండటానికి ఏర్పాటయింది. అతను ఆ పూరి చావడిలో దిగాడు.

వెంటనే ఫర్కువరుడు తన అన్వేషణ మొదలు పెట్టి, దేవాలయం గురించి వివరాలు సేకరించ సాగాడు.

గుడి ఏటి గట్టున తోపులో ఉంది. పక్క ఊరి నుండి రోజూ పూజారి వచ్చి పూజచేసి వెళ్ళే ఏర్పాటు ఉంది.

రంగడిపల్లె కొత్త ఊరిలో పాటలు పాడేవాళ్ళు, బుర్రకథలు చెప్పే వాళ్ళు ఎవరూ లేరు. కోలాటం వేసే కుర్రాళ్ళు ఉన్నారు. కాని,ఇక్కడి కన్న పక్క ఊరి హాలహళ్ళి యువకులు ఈ నృత్యంలో నిపుణులు. ఫర్కువరుడు కావాలంటే వాళ్ళు ఇక్కడికే వచ్చి కోలాటం వేసి చూపిస్తారు.

దేవాలయ కట్టడం ఏమంత గొప్పగా లేదు. రాతి కట్టడమే అయినా,ఒక కొండ దిబ్బకు అనుకున్నట్టుగా కట్టారు. దిబ్బ కూడా పెద్దదేమీ కాదు—సామాన్యమైనదే. గుడి వెనుక గోడగా నిలచిం దది. కట్టడం అందంగానూ లేదు. విగ్రహం రాతి దవునో,కాదో తెలీదు. సిమెంటుతో చేసినదని అక్కడివా ళ్ళన్నారు. చూట్టానికి అందంగా ఉంది. దేవాలయం అంటే ఉట్టి మంటపం మాత్రమే. కనుక బయట్నుంచే మూర్తి కనిపిస్తోంది. క్రైస్తవులు లోపలికి వెళ్ళడానికి లేదు కాబట్టి తను బయటనుంచే దర్శనం చేసుకున్నాడు. మర్నాడు మధ్యాహ్నం పూజవేళకు దేవాలయం దగ్గర కెళ్తే ఎవరికీ ఇబ్బంది కలగకుండా దేవుడి దర్శన మవుతుంది. అంతవరకు ఫర్కువరుడు కావాలనుకుంటే పాత ఊరి నివేశనాన్ని చూసి గుడిని దూరంనుంచి చూసి, ఏటి ఒడ్డున కాసేపు కూర్చుని వెనక్కి రావచ్చు. రాత్రికి కోలాటం చూడవచ్చు అని చెప్పారు.

ఫర్కువరుడు సరే నన్నాడు. రామప్పతో కలసి పాత ఊరికి వెళ్ళాడు. ఊరు మనుమత్తి అవశేషంలోని భాగంగా వెనుకటి వైభవాన్ని, ఇప్పటి దీనావస్థనూ మౌనంగా చాటి చెబుతోంది. దాని పక్కగా ఒక త్రోవ. దాని కొనన ఒక మామిడి తోపు. మధ్యన ఒక గుట్ట. ఫర్కువరుడు పాత ఊరి నిర్మాణాన్ని, తోపుని, గుడిని అన్నీ చూసి జరిగిపోయిన జీవితంతో, తనకు సులువైన పద్ధతిలో సంబంధాన్ని కల్పించుకున్నాడు. ఆ కల్పనా లోకంలో మునిగి తేలుతూ వెళ్ళి చెరువు దగ్గర పూర్వ స్నానఘట్టం దగ్గర ధ్యానంలో కూర్చున్నాడు.

ఒక ఊరి గత చరిత్రతో బ్రతుకుతూ ఇలా కలిసిపోగల మనస్తత్వానికి ఊరు మాత్రం పాడైపోయినా,బ్రతుకు మళ్ళీ కొనసాగుతున్నట్టే కనిపిస్తుంది. ఇదెలాగు అని మనం తెలుసుకోవాలంటే ఏదైనా సంత జరిగినప్పుడు ఆ సంతలో కలసి మెలసి తిరిగి ఓ చోట కూర్చోవాలి. సంత పూర్తయిపోయాక కూడా అక్కడే ఉండాలి. జనం అంతా వెళ్ళాక కూడా దాని తాలూకు ధ్వని, గుర్తులు అక్కడి గాలిలో మిగిలే ఉంటాయి. చెట్టు కింద కూర్చుని రాశి వక్కలు అమ్మిన జరీ పాగా శెట్టి అక్కడే కూర్చుని ఉండటం నీడలా కనిపిస్తుంది. ఇటు బండదగ్గర కూర్చుని వేరు సెనక్కాయలు అమ్మే పల్లెటూరి ముసలమ్మ కనిపిస్తుంది. కొడుక్కి తినడానికి వేరు సెనక్కాయలు కొనిచ్చి, వాడితోబాటు వక్కల అంగడికి వచ్చి ఇంటికి వక్కలు కొన్న గృహస్థు అక్కడే కొడుకుతో కలసి తిరుగుతున్నట్టు కనిపిస్తాడు. మూడు డబ్బులకు ఉప్పు, మూడు డబ్బులకు మిరియాలు కొని, తను కట్టుకొన్న రంగుచీర కొంగులో దాన్ని ముడి వేసుకుని ఊరికి వెడుతున్న ఆడకూతురు, సంత మైదానం చివర కనుమరుగైనా మాసిపోని చిత్తరువులా కనిపిస్తూ ఉంటుంది. సంత మైదానంలో చూసిన ఈ మూర్తులు మళ్ళీ కళ్ళ ముందు నిలిచే అనుభూతి పొందేలా, పాత ఊరి నివేశనంలో మన మనసు కల్పించే ప్రజలు తిరుగాడటం చూడొచ్చు. ఫర్కువరుడు ఏటివడ్డున కూర్చుని ఆ ఊరిదని తాను కల్పించుకున్న బ్రతుకుని ఊహలో నెమరు వేసుకున్నాడు. ఊరు ఒక వ్యక్తిలా తనతో పలుకుతున్నట్టే అనిపించింది. ఆ ధ్వని మొత్తం ఊరిమీదుగా వచ్చినట్టున్నా,ఎక్కువగా దేవాలయం వేపునుండే వచ్చిన ట్టనిపించిం దతనికి. అప్పు డలా అనిపించడమూ సహజం. అక్కడ భావ సమాధిలో మునిగిపోయిన ఫర్కువరుడు- రామప్ప బలవంతం చెయ్యడంతో లేచి కొత్త ఊరికి బయల్దేరాడు.

రాత్రి ఆ ఊరివాళ్ళు పక్క ఊరివాళ్ళతో పదాలు పాడుతూ కోలాటం వేశారు.

"రంగడిపల్లె రాముడి పాట వచ్చా మీకు?" అనడిగాడు ఫర్కువరుడు.

"రాకేం? వస్తుంది. దాన్ని పాడకుండా ఉండం కదా మేము. కాని,అది పిల్లల పాట."

"పాడకుండా ఉండం అంటే?"

"అంటే ఒక్కొక్క ఊరిలో ఒక్కొక్క ఆటకు వారసులు ఉంటారు. వాళ్ళని గురువులు అంటాం. మా ఊరి కోలాటం గురువులు కట్టిన పాట అది. మేం ఆటకట్టినప్పుడు ఆ పాట పాడకపోతే ఆ నాటి ఆటను దేవుడు మెచ్చడు. ఇది మా నమ్మకం" అంటూ ఆటగాళ్ళ నాయకుడు వివరించాడు.

ఈ ఒక్కొక్క మాట ఫర్కువరుడి కుతూహలాన్ని ఎక్కువ చేశాయి. పిల్లల దాగుడుమూ తల పాటలా కనిపించిన ఈ పాట అతడికి రాత్రంతా నిద్రలేకుండా చేసింది. దాన్ని రాసిన వాడు ఆ మాటల వెనుక ఏదో అర్థాన్ని దాచాడు. ఏమిటది?

ఫర్కువరుడు రామప్పని- "ఇక్కడ ముంగరవళ్ళి గుట్ట అని ఏమన్నా ఉందా?" అని అడిగాడు.

రామప్ప- "అవును. ఊరికి పశ్చిమాన రెండు మైళ్ళ దూరాన ఉన్న గుట్టని ముంగరవళ్ళి దిబ్బ అంటారు" అంటూ ఆ వేపుకి చెయ్యి చూపించాడు.

ఫర్కువరుడు ఆ పాటలో చెప్పినట్టుగా దిబ్బ ఎక్కి తూర్పు వేపు చూడా లనుకున్నాడు. మర్నాడు రామప్పతో కలసి అక్కడికి వెళ్ళాడు. గుట్ట ఎక్కి తూర్పువేపు చూస్తే రంగడిపల్లె ఏటిగట్టు,దాని లోపలున్న తోపు, తోపులోపలి గుడి వెనుకభాగం అక్కడికి కనిపించాయి. పాటలో ఉద్దేశపూర్వకంగానే ఈ స్థలాన్ని గురించి సూచించాడు అన్న విషయం ఖచ్చితమైంది. చూడ్డానికి దాగుడుమూతల పాట అయినా, అది పిల్లలకోసం కట్టిన పాట కాదు. ముంగరవళ్ళి దిబ్బ ఎక్కు తూర్పున చూడు. అక్కడ రాముణ్ణి చూడగలిగిన వాడు తెలివైనవాడు (జాణ) అంటున్నాడు కవి. ఎక్కడున్నాడు? ఏమి చూడాలి? గుట్టని ఎక్కిన తనలాంటి వివేకికి ఏదో చెయ్యమని చెప్పాలని ఆ పాట కట్టిన వాడి తపన. తను చెయ్యాల్సిన ఆ పని ఏమిటి? చూడు... చూడమంటున్న ఆ ధ్వని దేన్ని చూడమంటోంది?

ఫర్కువరుడు ఈ విషయాన్నే ఆలోచిస్తూ కాసేపు ఆ దిబ్బమీదే నుంచుండిపోయాడు. తరువాత మెల్లగా దిగి ఊళ్ళోకి వచ్చాడు. వస్తూ పాత ఊరి సంగతులు రామప్పకు ఏమైనా తెలుసా? దేవాలయం గురించి పూర్వీకులు చెప్పే కథలేమన్నా ఉన్నాయా అని కనుక్కున్నాడు.

ఆ ఊరు మంచి దశలో ఉన్నప్పుడు టిప్పుసుల్తాన్ దళవతి ఒకడు ఆ ప్రాంతాన్ని స్థానికుల చేతినుండి వశపర్చుకున్నాడు. ఆ ఊరు అన్ని విధాలా వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో అక్కడ స్థావరం ఏర్పరచుకున్నాడు. సైన్యం అక్కడ విడిది చేస్తుందని తెలియగానే ప్రజలు ఊరు విడిచి పారిపోయారు. అలా వెళ్ళేటప్పుడు ఊరి పెద్దలు దేవస్థానం ముసల్మానుల చేతిలోపడి ధ్వంసం కారాదన్న ఉద్దేశంతో దాని చుట్టూరా

మట్టి పోసి, పైనకూడా పల్చగా మట్టి పరచి వెనుకనున్న దిబ్బతోబాటు అది కూడా దిబ్బలా కనిపించేలా చేసి వెళ్ళిపోయారు. టిప్పుసుల్తాన్ రాజ్యమేలినంతకాలం ఆ సేనలు అక్కడే ఉన్నందువల్ల ఊరి మనుమలు ఎక్కడెక్కడో నివాసా లేర్పరచుకుని ఉండిపోయారు. సుల్తాన్ ఓడిపోయి, బ్రిటిష్ వారు సింహాసనాన్ని మళ్ళీ మైసూరు రాజ వంశీకులకి అప్పజెప్పాక ఈ కొత్త ఊరు వెలిసింది. రంగడివల్లె తోపులో దేవాలయం ఉంది. మట్టి దుబ్బ చాటున దాగుని ఉంది అన్న ప్రతీతి ఉన్నందువల్ల మళ్ళీ కొత్తూరు ఏర్పడినప్పుడు దేవస్థానపు తలుపులు తీయించాలని అర్చకుల ఇంటి పెద్దలు చెప్పిన సంగతి పిల్లలకు గుర్తుంది. దాని ప్రకారం వాళ్ళు ఒక మంచి రోజు చూసి ఏదో గుర్తుల్ని బట్టి దిబ్బ మీద ఒక చోట కొద్దిగా తవ్వి చూశారు. అప్పుడు దేవాలయపు తలుపు, ముందువేపు గోడ బయట పడ్డాయి. ఆ తరువాత దేవాలయపు తలుపులు తెరచి సంప్రోక్షణ చేసి మళ్ళీ పూజ ప్రారంభించారు.

ఈ సంగతులన్నీ ఫర్కువరుడు శ్రద్ధగా విన్నాడు. అర్చకుడు రావడానికింకా వేళ ఉందని, ఏటిలో స్నానం చేసి ఇంకా ఏదైనా తెలుసుకోవలసింది ఉంటే దేవుడే దారి చూపాలని అనుకుంటూ ఏటి ఒడ్డున కూర్చున్నాడు. కాసేపటికి దేవాలయ అర్చకుడు వచ్చి తలుపులు తెరిచాడు. ఫర్కువరుడు వెళ్ళి దాని లోపలి భాగాన్ని, విగ్రహాన్ని చూశాడు.

దావాలయం- రామప్ప అన్నట్టుగా ఒక సామాన్యమైన మంటపం. విగ్రహం శేషశయన రంగనాథుడు. పురాతన విగ్రహం అన్నట్టుగా లేదు.

అర్చకుడు పూజ చేశాక ఫర్కువరుడు అతడిని కొన్ని ప్రశ్న లడిగాడు.

"ఈ దేవాలయాన్ని రామ దేవాలయం అంటారా?"

"అవును. నేను హారతి ఇచ్చేటప్పుడు రామ దేవుడికి కూడా మంగళం చెబుతాను. ఆఖర్ని రంగనాథుడికి నమస్కారం చెప్తాను. అది ఇక్కడి వాడుక."

"ఇలాగ ఇంకెక్కడైనా ఉందా?"

"మాకు తెలియదు."

"మిగతా కొన్ని చోట్ల శ్రీనివాసుడు, రాముడు, కేశవుడు మొదలయిన విగ్రహ మూర్తులని కూడా 'రంగా' అని ఎందుకంటారో మీకు తెలుసా?"

దీని కారణాన్ని గురించి ఫర్కువరుడు ఇంతకుముందే విన్నాడు. ఇక్కడేమి చెబుతారో అని ప్రశ్న వేశాడు.

అర్చకుడు- "సుల్తాన్ కాలంలో రంగనాథుడి ఆలయానికి అపచారం జరుగ రాదన్న ఆంక్ష ఉండేది. శ్రీరంగపట్నంలోని దేవుడు రంగనాథుడు. కనుక దీన్ని తెలుసుకున్న అన్ని ఊళ్ళ వాళ్ళు తమ ఊరి దేవు డెవరైనా సరే రంగనాథుడిగానే చెప్పుకుని పూజించే వారు. సుల్తాన్‌ల అధికారులు ఆ దేవాలయాలపట్ల అణకువతో నడుచుకునే వారని మాపూర్వీకులు చెబుతుండేవారు" అని బదు లిచ్చాడు.

"వేరే దేవుళ్ళున్నచోట రంగనాథుడని పిల్చుకుంటూండగా, ఇక్కడి రంగనాథుడే దేవుడై ఉండగా రామచంద్రుడి పేరెందు కొచ్చిం దంటారు?"

"అవన్నీ మాకేం తెలియవు. వెనుకటి వాళ్ళు చెప్పినదాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే మా పని."

ఈ సంభాషణ జరిగేటప్పుడు రామప్ప కూడా అక్కడే న్నాడు. అతడు అర్చకుడితో-"ఆ సంగతొకటుంది కదా... చెప్పరాదా, అయ్యవారూ!" అన్నాడు.

అర్చకుడు వినిపించుకోనట్టుగా ఊరుకున్నాడు.

ఫర్కువరుడు—"అదేమిటి?" అనడిగాడు.

అర్చకుడు మాట్లాడలేదు. ఫర్కువరుడు రామప్ప వేపు చూశాడు.

అతడు, "దేవుడిని గురించిన మాట అది. చెప్పవచ్చు ననుకుంటే ఆయనే చెబుతారు. మేము చెప్పడానికి లేదు" అన్నాడు.

ఫర్కువరుడు మళ్ళీ అర్చకుని వేపు చూశాడు. అతడు కదలకుండా కూర్చున్నాడు.

దేవుడిని గురించినది, అందరికీ చెప్పకూడనిది ఏమై ఉంటుంది? రామ, రంగ అన్న పేర్లకి సంబంధం ఉండివుండదు. అయినా, అది తెలిస్తే తన అన్వేషణ మరికొంత సులువవుతుంది. అందుకే ఫర్కువరుడు అర్చకునితో, "స్వామీ! నన్ను మీ దేవుడి శత్రువుగా భావించకండి. రాముడికైనా, రంగడికైనా నేను చెడు చేసేవాడిని కాను. నన్ను ఒక హిందువుగా భావించి ఎలాంటి సంగ




తైనా ధైర్యంగా చెప్పండి. ఆ సంగతి నాకు తెలిసినందువల్ల దేవాలయానికి ఏదైనా మంచి జరగవచ్చు. దాన్ని సంతోషంగా చేస్తాను" అన్నాడు.

పలురకాలుగా, ఎంతో వినయంగా ఇదే మాట ను ధర్మవరుడు పదే పదే చెప్పాక-అర్చకుడు "కానివ్వండి,దొరగారూ, చెబుతాను. ఇంతకూ అది మీకు తెలియడం వల్ల ఇబ్బంది లేదు. మాఇంట్లో ఒక తరంలో పూజ నిర్వహించిన తండ్రి, తరువాత పూజ నిర్వహించబోయే కొడుక్కి రెండు సంగతు లను చెవిలో ఉపదేశించేవారు. అందులో ఒకటి- ఈ రంగనాథుడు పూర్వకాలంనుండీ ఉండిన దేవుడు కాడు. రామదేవుణ్ణి దాచేసి, ఈ దేవుణ్ణి చేయించారు అన్నది. ఈ మాట ఎలాగో ఇతరుల చెవిన బడి ఈ గౌడుగారికి తెలిసినట్టుగా మరి కొందరికి తెలిసింది. కాని,ఈ రహస్యం మే మెవరికీ విప్పి చెప్పం ఇటీవల వెలసిన దేవు డని తెలిస్తే ప్రజలకి భక్తి తగ్గుతుందేమోని! భయం, భక్తి తగ్గి వాళ్ళు పాడవుతారేమోనని పెద్దల భయం. దేవుడికి వయ సేమిటి? పాత అని ఎక్కువ కాదు, కొత్త అని తక్కువకాదు. మనిషి బుద్ధి చెడకుండా ఉండాలని మే మీ మాట చెప్పం. తమరు దేవుడికి మొక్కుబడికి మరోటి చేసి నడుచుకునే వారు కాదు. దీన్ని మీకు చెప్తే పోయేదేమీ లేదు. కాని,మీరు దీన్ని మనసులోనే ఉంచుకోవాలి" అన్నాడు.

ధర్మవరుడు- "సరైన మాట. తెలియని జనాని కి ఇలాంటి మాటల వల్ల బుద్ధి మారవచ్చు. పూజచేస్తూ చేస్తూ పూర్వకాలపు మూర్తి, కొత్తకాలపు మూర్తి అని భక్తి, మర్యాద ఎక్కువ తక్కువ చెయ్యగలమా? ఇదొక్క సంగతి సరే, చెవిలో చెబు తున్న రెండవ సంగతి ఏమది?" అన్నాడు.

ఈ మాటడుగు తున్నప్పుడు అతని మనసులో రామదేవుణ్ణి గురించిన "దాచేసి" అన్న శబ్దం అన్నిటికన్న ముఖ్యమైనదిగా అతడి చెవులో మార్మో గ సాగింది. కాని,దేవస్థానపు మూర్తిని ఎలా దాచారన్నది అడగదగ్గ ప్రశ్నగా తోచలేదు.

ధర్మవరుడు అడిగిన ప్రశ్నకి అర్చకుడు బదు లు చెప్పలేదు. ధర్మవరుడు రామప్పవేపు చూశా డు. రామప్ప అర్చకుడితో —"ఈ మాటే చెప్పారట. ఇక దాన్ని చెప్పడానికేం? దేవుణ్ణి తక్కువ చేసే మాట చెప్పగా లేనిది మనిషిని తక్కువ చేసే మాట చెప్పటానికేం?" అన్నాడు.

అర్చకుడు, "అయితే నువ్వే చెప్పు" అన్నాడు.

రామప్ప"స్వామీ! పూర్వీకులు చెప్పేవారట. రంగప్ప ఉన్న చోటనే రాముడూ ఉన్నాడు. పుణ్యం చేసుకున్న వాళ్ళ కళ్ళకి కనిపిస్తాడు. ఆయన్ని చూడగలిగే కళ్ళు పవిత్రమై ఉండాలి. ఏ కాలానికి ఏ మహాత్ముడు పుట్టుకొస్తాడో మరి. అప్పుడు రంగనాథుడు ఉన్న చోటనే రామచంద్రు డూ కనిపిస్తాడట. ఆయన పుణ్యం వల్ల దర్శనమి చ్చిన స్వామి అందరి కళ్ళకూ కనిపిస్తాడట. మేమే మో పాపిష్టి వాళ్ళం అనుకుంటే, మా అర్చకుల కళ్ళకు కూడా రామదేవుడు కనిపించడం లేదు. దేవు డెలాగూ కనిపించలేదు. ఈ దేవుడు చాలడు, రామదేవు డెక్కడా అని బుద్ధి వెతక్కుండా ఉండా లి. అలా బుద్ధి పక్కదారి పడితే, మరోహరి మా టలా ఉంచి తమ ఇల్లే నాశనం అవుతుందని అర్చకుల భయం. అందుకే ఆయన ఆ మాటని మనసులో కూడా అనుకోరు. పెదవులు దాటనీయ రు. కనిపించే దేవుణ్ణి కాదని, కనిపించని మరో దేవుడిని పూజించడానికి తపనపడే మనిషి త్రి శంకు స్వర్గం పాలవుతాడు కదా" అంటూ వివ రించాడు.

తరువాతి సంగతి ధర్మవరుడి మాటల్లోనే చెప్ప చ్చు-నేను "ఇంకేమయినా ఉందా?" అనడిగాను. ఇక్కడి జనంలో ఇదొక వాడుక. ఏ విషయమైనా కొద్దికొద్దిగా చెబుతారు. వీళ్ళతో మాట్లాడేటప్పుడు తొందరపడి ప్రయోజనం లేదు. ఏదైనా, విషయం చెప్పదగినదైనా వినేవాడి యోగ్యతను తెలుసుకో కుండా చెప్పకూడ దన్నది వీళ్ళ మతం. ఇక వినేవాడు నాలాగ అన్య మతస్థు డయితే, అపరిచి తుడైతే పని కానే కాదు.

ఓ క్షణం ఊరుకుని అర్చకుడు- "లేదు,దొరగా రూ, మరింకేమీ లేదు. ఉంటే అది మాకు తెలియ దు. మాలో ఎప్పుడు ఒక పుణ్యపురుషుడు అవతరి స్తాడో అప్పు డిక్కడ రంగనాథుడితోపాటు రామదే వుడూ కనిపిస్తాడు. ఆ నమ్మక మొకటే మాకు తెలిసింది. అంతవరకూ మేము రంగనాథుడే రాముడని మరువక పూజ జరుపుతూ ఉండాలి" అన్నాడు.

'రంగనాథుడితో రామదేవుడూ కనిపిస్తాడు' వీళ్ళ అర్థంలో అదో అద్భుతం. మాలాంటి వాళ్ళ కి? దాచి పెట్టిన రామ దేవుడు అక్కడే ఉన్నాడని ఆ పాటకి అర్థమయి ఉండొచ్చు. అక్కడే అంటే ఎక్కడ? రంగనాథుడి విగ్రహం లోపలా? లేదా


తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు నాకు మా మందు కనిపెట్టబడింది చికిత్సను సరిగా పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుంచి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివారాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు నాసి లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడుకు చల్లదనం ఇస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్సు ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (A )**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



గుడివాడలో కాదు యిప్పుడు విజయవాడలో

కాకతీయ ఇన్ఫర్మేషన్ సర్వీస్

లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణమండపం ఎదురుగా
బెంజిసర్కిల్, విజయవాడ-520006.

మీ అబ్బాయికి అందమైన భార్య కావాలా?
మీ అమ్మాయికి అందమైన భర్త కావాలా?




ఆస్తి, అంతస్తు, అర్హతను బట్టి అనువైన సంబంధాలకు సంప్రదించండి!

విదేశాలలో స్థిరపడిన 'కమ్మవారికి' స్వదేశం నుంచి సరైన పెళ్ళి సంబంధాలు!

నెలల వ్యవధిలో జతకలిసిన పెళ్ళి సంబంధాలు ఎన్నో! ఇప్పుడు సంప్రదిస్తున్నవారు మరెందరో!

గుర్తుంచుకోండి
మీ వివరాలు మాదగ్గర గోప్యంగా వుంటాయి!




దాని వెనుకనా? లేదా దేవాలయపు భూమిలోపలా?

ఎక్కడ ఎక్కడని నా మనసు వేటని పసిగట్టిన వేటకుక్కలాగా అక్కడే పరిభ్రమించసాగింది.

అప్పటికి మధ్యాహ్నం దాటింది. నేను, రామప్ప కొత్తూరికి వచ్చాం. అర్చకుడు సాయంత్రం వస్తానని చెప్పి, వాళ్ళ పల్లెకి వెళ్ళాడు. అప్పటి కొక సమస్య పరిష్కారమైనట్టే. మొదట్నుంచీ ఉన్న దేవుడు రంగనాథుడై ఉండకూడదా? గ్రామం పేరు రంగనహాళ్ళి అని ఉండటంవల్ల అదికూడా సాధ్యమే. కాని రంగడిపల్లె అనే పేరు రంగనాథుడి దేవాలయం వల్లనే వచ్చిందని చెప్పడానికి లేదు. ఇక్కడ ఊళ్ళ పేర్లు కూడా మనుమల పేర్లను బట్టి పెట్టడం అలవాటే. ఊరిని పైకి తెచ్చిన వ్యక్తుల పేర్లతో కూడా పిలుస్తారు. రంగడిపల్లె రంగడనే పేరున్న వ్యక్తి పాటుపడ్డం వల్ల పెరిగిన ఊరు కావచ్చు. అలాంటి మనిషి రంగనాథుడి దేవస్థానాన్ని కట్టి గ్రామాన్ని దేవుడి పేరుతో పిలిచి ఉండొచ్చు. కాని, ఈ మాట బహుశః ఈ సందర్భానికి అన్వయించక పోవచ్చు. ఈ కళ్యాముసి అడవీ గోడ అనే పదాన్ని కట్టిన సమయంలో రంగడిపల్లె దేవుడు రాముడు కనుక రంగ అన్న మనిషి ఇక్కడ నివసించడానికి అతడి పేరుమీదుగా రంగడిపల్లె అని పేరు వచ్చి ఆ పల్లెలో రామదేవుడిని ప్రతిష్ఠించి ఉంటాడు.

ఇన్ని విషయాలు ఆలోచించాక కోలాటం పాటలోని ఒకటి రెండు మాటలు మరింత స్పష్టమయ్యాయి. అందులో వచ్చే 'మరియాదె (మరుగాయె) రామ' అన్నది జనపద సాహిత్యంలోని మర్యాద రామన్న కాదు. ఈ ఊరి దేవుడైన రాముడు. మరుగాయె రాముడని ఎందుకయింది. మరో మాట ఏదైనా ఉండి, పాడగా పాడగా పాటగాళ్ళ నోట ఇలా మారిపోయిందేమో. అంటే మరుగు-ఆయె-రాముడు. మరుగయ్యావు రాముడా, మరుగు-ఆది-రామ, అన్న ఏ మాటలైనా పాటగాళ్ళ నోట పల్లెవాళ్ళ మాటల్లో మరుగాయె అని మారి ఉండచ్చు. రంగనాథుడి మూర్తిని నిర్మించి,రాముణ్ణి వాళ్ళే మరుగు పరిచినప్పుడు "రామానువ్వు మరుగయ్యావనో", లేదా "రాముడు మరుగయ్యాడనో" పాటగాడు మాటల్ని కూర్చి ఉండొచ్చు. పాటలో తెర ఆయెనప్పుడు "సిరి రంగధాముడు అన్న మాట శేషశయన రంగనాథుడు అప్పుడు కనిపించాడు (తెర=తెరచు, తెర=తెర).అన్న అర్థంలో కూడా వాడి ఉండొచ్చు.

సాయంత్రం అర్చకు డొచ్చినప్పుడు అతడితో దీన్ని గురించి మళ్ళి చర్చించాను. అతను-"దీన్ని గురించి పండితులు చెప్పాలి. ఇది మేము ఈదగలిగిన నీరు కాదు. అయితే,తెర అయ్యాడు రంగనాథుడు అంటే, అప్పుడు కనిపించాడన్న అర్థం రాదిక్కడ. రంగనాథుడే తెర (పరదా)గా అయినాడు. రాముడు కనిపించకుండా అతడికి అడ్డుగా నిలిచాడనే అర్థం వస్తుంది. దీనిమీద తెలిసిన వారి వివేచన ఎలా ఉంటుందో మరి" అన్నాడు.

ఏ భాష అయినా సరిగ్గా అర్థం కావాలంటే దాని లోతుపాతులు, పుట్టుపూర్వోత్తరాలు బాగా తెలియాలి. మా వాళ్ళ ఈ ముఖ్యమైన మాటని చాలాసార్లు మరిచిపోతారు. తెర అంటే నేను తెరచిన, వ్యక్తమైన అని అర్థం చెప్పుకున్నాను. అంటే రంగనాథుడు ప్రకటమయ్యాడని అనుకున్నాను. పెద్ద పండితుడు కాకపోయినా, అర్చకుడు చెప్పిన అర్థం నేను అనుకొన్న అర్థం కన్న సమంజసంగా ఉందనిపించింది. రాముడు మరుగయ్యాడు. రంగ డపుడు తెరగా నిలిచాడు.

ఇంత ఆలోచించాక నాకు తెర అన్న మాటకు మా భాషలో స్క్రీన్ అనడం, వెయిల్ అనడం సూటిగా మనసులోకి చొచ్చుకు వచ్చింది. స్క్రీన్,వెయిల్ అని జపిస్తున్న మనసుకి బిహైండ్ ది వెయిల్ అనే శబ్ద సముచ్చయాన్ని గుర్తుకి తెచ్చి, అదేమి దేవుడి కృపో, ఆశీర్వచనమో గాని ఆ క్షణంలో సత్య సాక్షాత్కారం అయినట్టనిపించింది.

మనసుకు సత్యం సాక్షాత్కరించినా, వెంటనే ఇది ఒట్టి భ్రమ గనుక అయితే ఇంకేమి గతి అన్న భయమూ కలిగింది. నిజమే అయితే నేను భాగ్యశాలిని. నిజమో, కాదో చూడాలి కదా. నాకు తోచిన దాన్ని ఈ సమాజానికి తెలియజేసే పని మొదలు పెట్టడమా లేదా వాళ్ళ చేతనే పని చేయించి వాళ్ళే సత్యాన్ని కనుక్కునే విధంగా చెయ్యడమా? ఏదైనా సరే, రేపు ఉదయమే ఏదో ఒకటి చెయ్యాలి. కాని, నాకు అంతవరకూ దేవాలయానికి దూరంగా ఉండటం అసాధ్యం అనిపించింది. వెంటనే నేను దేవాలయం దగ్గర కెళ్ళాను. అర్చకుడు, రామప్పలతో కలసి దిబ్బచుట్టూ తిరిగి చూశాను. దాన్ని బాగా పరిశీలించాక నా ఊహ సరియైనదే అని మనసుకు మరింత ఖచ్చితమయింది. అప్పుడు నాకు మళ్ళీ ఊరికి వెళ్ళాలనిపించలేదు. చేతికి దొరికిన 'సత్యం' జారిపోతుందేమోనన్నట్టుగా నా మనసు, ప్రాణమూ అక్కడే ఉండాలని ఆరాటపడ్డాయి. నేను నా స్నేహితులతో, "ఈ రాత్రి మీ దేవుడి సన్నిధిలో ఉండాలనిపిస్తోంది నాకు" అన్నాను.

అర్చకుడు చప్పున తలెత్తి నా వేపు చూశాడు. అతని మొహం భీతితో నిండి ఉంది. నేను రాత్రి అక్కడ ఉండి వాళ్ళ దేవుడిని ఏదో చేసేస్తానుకుని ఉంటాడతను.

నేను— "భయపడకండి. నాతోబాటు మీరూ రండి. ఉదయమే పనివాళ్ళు రెండు పలుగులు, పారలు తీసుకు వచ్చేలా ఏర్పాటు చెయ్యండి చాలు" అన్నాను.

'మీరూ ఇక్కడే ఉండొచ్చు' అన్న నా మాట విన్నాక ఆయన ధైర్యం తెచ్చుకున్నాడు. పలుగు, పార అనేసరికి ఆయనకి మళ్ళీ సందేహం కలిగింది. క్షణం ఆగి, "రాత్రికి భోజనం లేకుండా ఎందుకుండడం? ఊళ్ళోకి వెళ్ళి భోజనం చేసి వద్దాం" అన్నాడు.

ఒద్దంటే అత డనవసరంగా భయం పెంచుకుంటాడని సరే నన్నాను.

ఆ రాత్రి నేను దేవస్థానం ఎదుట ఒక రాతి పలక మీద చాప పరచుకుని పడుకున్నాను. అనుకోకుండా నిక్షేపం దొరికినపుడు కలిగే ఆనందంలో నిద్ర పట్టనట్టుగా ఆ రాత్రి సంభ్రమంలో నాకు నిద్ర రాదేమో ననిపించింది. ఒకసారి కొద్దిగా తూగు వచ్చినప్పుడు నా కో దృశ్యం కనిపించింది. దాన్ని కల అనలేం. కల కాస్త మసకగా ఉంటుంది. కాని, ఇది దృశ్యం, నిజమైన దర్శనమనే చెప్పాలి. మెలకువ కన్న ఎక్కువ తెలివిగా ఉన్న అనుభూతి. కల అంటే మెలకువ కంటే క్రింద ఉండే అనుభవం. ఈ దర్శనమేమో మెలకువకు ఒక మెట్టు పైన ఉన్న అనుభూతి.

ఆ దృశ్యంలో నా ఎదుట మూడు సుందర విగ్రహాలు సాక్షాత్కరించాయి. వాటి ముందు చేతులు జోడించిన వానరమూర్తి. నేను ఇంతకు ముందు సీతా రామ లక్ష్మణుల విగ్రహాలు చూశాను. ఇవీ అలాంటి మూర్తులే. సీతాదేవి... నా తల్లి చిన్నప్పు డిలానే ఉండేదేమో అనిపించేలా లావణ్యంతో మెరుస్తోంది. నా వేపు మాతృ వాత్సల్యం నిండిన కళ్ళతో చూస్తున్నట్టే అనిపిస్తోంది. ఆ విగ్రహానికి ఎడం పక్కగా, మధ్యగా రామచంద్రుడి విగ్రహం. ఈ దేశంలో జనం విగ్రహరూపంలో ఉన్న దేవుళ్ళని దివ్య మంగళ విగ్రహం అంటారు. ఆ మాట సార్థకమనిపించేలా ఉన్నది ఆమూర్తి. దానికి మరొక పక్క లక్ష్మణుని మూర్తి. అంతే అందంగా ఉండి, కొద్ది వినయంతో కూడిన భంగిమ. హనుమంతుడు వానరుడైనా, హాస్యాస్పదంగా అనిపించదు. మానవ మూర్తి కాకపోయినా, వానర జాతిలో సుందరమైన ఆకారం. క్రైస్తవుడిగా పుట్టి పెరిగిన నాలో విగ్రహారాధన తప్పు అన్న భావన జీర్ణించుకుపోయింది. మామూలుగా అయితే నేను ఆ విగ్రహాలను దేవుళ్ళని పిలువలేను. కాని మగతగా ఉండి, దర్శిస్తున్న ఆ రాముడి మనో

మోహనమైన రూపానికి ఒక్కసారిగా వశమైపోయాను. ఆ కాలివేళ్ళు తీర్చి దిద్దిన ట్టున్నాయి. నిష్కామంగా అటు వంగి, ఆ కాలి వేళ్ళను ముద్దుపెట్టు కుందా మనిపించింది. కాని, అంతలో ఆ దృశ్యం కనుమరుగై పోయింది. ఇక ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. అర్ధరాత్రి ప్రశాంతతను ఆస్వాదిస్తూ రంగనాథుడి ఎదుట కూర్చుని కాలం గడిపాను. లోకమంతా నిదురించే సమయంలో మెలకువగా కూర్చుని కావలా కాసే ఓపికకి ఇలాంటి మూర్తి తగిన లాంఛనమని నాకు ఆ రోజు అనిపించింది.

ఆ నాటి చిత్రమైన అనుభవాల తోరణాలతో నా బుద్ధి విగ్రహారాధన సరియైన పద్ధతే అన్న ధోరణలో ఆలోచించింది కూడా.

ఉదయమే గ్రామం నుండి నలుగురు మనుషులు పలుగు పారలతో వచ్చారు. నేను అందులో ఒకడిని ఆ దిబ్బ మీదకి ఎక్కమన్నాను.

అర్చకుడు— "అయ్యో, దొరవారు, ఆ పనిమాత్రం వద్దు. ఆ గుట్ట కూడా దేవుడి శరీరంలా పవిత్రమైనది. దాని మీద అడుగు పెట్టకూడదని మా పెద్దల ఆజ్ఞ. ఎక్కిన వాడికి రౌరవ నరకాలు తప్పవు జాగ్రత్త" అన్నాడు.

నేను— "మీ రామదేవుణ్ణి కనుక్కుని మీకు చూపాలని తాపత్రయ పడుతున్నాను. నా ఊహ సరియైనదో, కాదో తెలుసుకోవాలి అంటే దిబ్బ మీద కెక్కి పైన ఉన్న మట్టి తియ్యాలి" అన్నాను.

అర్చకుడు—"'పైన ఉన్న మట్టికాదు. ఆ గుట్ట మీంచి ఒక పిడికెడు మట్టి తీసినా సరే ఆ తీసిన వాడు ఇంటిల్లపాదితోసహా సర్వనాశనమై పోతాడు' అని చెప్పారు మా పెద్దలు" అన్నాడు.


"అదేమో సరే, కొంతయినా మట్టి తీసి చూస్తే గాని నా ఊహ సరైనదో, కాదో తెలియదు" అని చాలా సేపు వాళ్ళకి వివరించి చెప్పాక ఒక ఒప్పందాని కొచ్చాం.

అర్చకుడు స్నానం చేసి వచ్చి మడిగా దిబ్బపై కెక్కాలి. పై భాగంలో ఒక మూర లోతున నలుచదురం నేలని తవ్వాలి. సరే, ఆయన శ్రద్ధ ఎంతటిదంటే అప్పటి కప్పుడు ఏటిలో స్నానం చేసి, అప్పుడే ఉతికి ఆరబెట్టిన సగం ఆరిన గుడ్డల్ని కట్టుకుని పాదం సోకకుండా మోకాళ్ళ మీద ఆ గుట్ట నెక్కాడు. దాని పై భాగంలో కొంత మట్టి తీశాడు.

చాలా లోతుగా తవ్వలేదు. పలుగుతో తవ్విన చప్పుడుతోనే తెలిసిపోయింది-దిబ్బలోపలి భాగం డొల్ల అని. అక్కడ పలుగుతో తట్టి చూట్టంతో దిబ్బ నిజమైన మట్టి దిబ్బ కాదు, లోపలి కట్టడం మీద మట్టి పోసి చూట్టానికి మట్టి దిబ్బలా తయారు చేసిన ప్రదేశమని తెలిసిపోయింది. అర్చకుడిని దిగి రమ్మని, "నా ఊహ అబద్ధమైతే, మొదటిలా దిబ్బని మూసేద్దాం. ప్రస్తుతం వీలయినంతమంది గుట్ట పశ్చిమభాగాన తవ్వి మట్టి తియ్యనీయండి" అన్నాను.

నా మాట మీద జనానికి శ్రద్ధ కలిగింది. ఊళ్ళోని జనమంతా పలుగులు, పారలు తెచ్చి పని ప్రారంభించారు. మధ్యాహ్నంలోపునే ఆ దిబ్బ మధ్యలో దారి ఏర్పడి, నేను ఎదురుచూసినట్టుగానే దేవాలయపు తలుపులు కానవచ్చాయి.

అర్చకుడు నా వద్దకు వచ్చి, "మీరు మహాత్ములు. మీ పుణ్య ఫలితంగా దేవాలయం వెలుగు చూసింది. ఇన్ని రోజులుగా పూజా పునస్కారా




లులేని దేవుణ్ణి ఉట్టి చేతుల్తో చూడ్డం సరికాదు. పూజాద్రవ్యాల్ని తెప్పించి సుముహూర్తంలో తలుపులు తెరుద్దాం. మీ ఎదుటనే పూజ జరిపిస్తాం" అన్నాడు.

దిబ్బనుండి పల్లెకు, పల్లెనుండి పొలానికి దేవాలయం కనుగొనబడిన సంగతి వ్యాపించింది. సాయంత్రం వేళకి పది గ్రామాల ప్రజ లక్కడ చేరారు. దివిటీలు, పూలు, పళ్ళు, వాయినాలతో దేవాలయంలోకి ప్రవేశించారు. దీనికి కారణమైన నాకూ ఆ రోజు లోపలికి ప్రవేశం దొరికింది.

లోపలి మందిరాన్ని మూసివేసిన రోజున వేసిన పూలమాలలతో, వస్త్రాలతో సీతా రామ లక్ష్మణులు, వాళ్ళ ఎదుట హనుమంతుడు కనిపించారు. ఆ రోజు ఆగిపోయిన పూజ, మళ్ళీ ఈ రోజు ప్రారంభమయింది.

దేవుడి పాదాల దగ్గర ఒక రాగి రేకు ఉంది. దాన్ని బయటకు తీసి చూడగా అందులో ఇలా ఉంది-"శాలివాహన శకం ఫలానా ఫలానా (అది గుర్తులే దిపుడు) సంవత్సరం మాఘ శుద్ధ పంచమీ దినం, రంగడిపల్లె ప్రజలు విధర్మీయులు వస్తున్న వార్త విని భయపడి, ఆర్షధర్మం ప్రకారం ఇక్కడ పూజింపబడుతున్న హనుమ, లక్ష్మణ సమేతులైన శ్రీ సీతారాముల సన్నిధిలో కల్పాంత పూజ జరిపి, హోమం చేసి దేవాలయాన్ని మూసి వేస్తున్నారు. మంచిరోజు వచ్చి, ధర్మం పునరుద్ధరింపబడేవరకూ రంగశాయి రూపంలో దేవాలయపు వెనుకభాగంలో దేవుడిని పూజించాలని నిశ్చయించారు. ఈ విషయం బయటపెట్టి భగవంతుడి దివ్యమంగళ విగ్రహానికి అపాయం కలిగేలా ఎవరయినా చేసినట్టయితే అతనికీ, అతని వంశానికీ కల్పాంతర రౌరవ నరకం సిద్ధిస్తుందని హెచ్చరిక! శుభమస్తు! పునరభ్యుత్థితే ధర్మే స సీతం సహలక్ష్మణం ధన్యాః పశ్యంతిమే నాథ మనిలాత్మజ సేవితం. స్వస్తి."

ఇలా కోలాటకారుని ఒక పాట ఆధారంగా నేను కనుమరుగైన దేవాలయాన్ని వెలుగులోకి తెచ్చాను. ఇవాళ నేను ఈ పని చెయ్యడంకోసమే ఆ నాడు అతడా పాట కట్టాడు.

తరవాత కొన్ని మాటలతో కోర్ట్నే సాహేబుగారు ఈ ఉదంతాన్ని ముగించారు.

ఫర్కువరుడు కథ పూర్తి చేసి, "స్వారస్యంగా ఉంది కదూ విషయం" అన్నాడు.

నేను—"చాలా స్వారస్యంగా ఉంది గాని, దిబ్బ లోపల దేవాలయం ఉన్న సంగతి నీ కెలా తోచిందో అర్థం కాలేదు" అన్నాడు.

ఫర్కువరుడు—" మన బుద్ధి ఇలాంటి సమయాల్లో అడుగడుగునా నడవదు. హనుమంతుడు సముద్రాన్ని దాటి సీతని కనుక్కున్నట్టుగా, అడ్డుగా ఉన్న దాన్ని దాటి సత్యాన్ని చూస్తుంది. ఇప్పు డాలోచిస్తే మనసు ఆ విధంగా పనిచేయడానికి కారణమేమిటో చెప్పవచ్చు. 'రంగనాథుడు మరుగు పరిచి ఉండాలి. ముంగరవళ్ళి గుట్టపై నుంచి కనిపించాలి. అలాంటి చోట రాముడుంటాడు.' పాట రాసిన వాడి ఉద్దేశం ఏమిటో? అర్థం చేసుకోవాలంతే. ఆ తరవాత అలా ఉండగలదా అని తోచాలి. ఆ క్షణంలో నా బుద్ధి 'ఉంటుంది' అన్నది అంతే!" అన్నాడు వివరించి.

నేను— "పాటలో మిగతా మాటలకీ ఇలాంటి అర్థాలే ఉండాలి కదా?" అన్నాను.

ఫర్కువరుడు—"ఓహో! లేకేం? పిల్లల పాటలో మినుముల మూట అంటే రావణుడు. అంటే ఇక్కడ శత్రువులు అని అర్థం. మన పక్షులు అంటే మన ప్రజలని. పరాయి పక్షులు అంటే విదర్మీయులని. మనకి సూక్ష్మం దొరికిపోయాక మిగతా మాటలన్నీ స్పష్టమే" అన్నాడు.

ఎమిలీ— "ఈ దేశంలో ఇలాంటి సంగతులింకా ఎన్నున్నాయో కనిపెట్టే జనం లేరు" అంది.

ఫర్కువరుడు—"ఈ దేశంలో ఉన్న జనం ఈ పని చెయ్యకూడదా? ఎందుకోగాని వాళ్ళ కేమీ పట్టదు" అన్నాడు.

తాము పూజ చేసే దేవుడిని మట్టితో మూసేశారనేసరికి నా మనసుకు కష్టం కలిగింది. నేను—"నిజంగా ఈ దేశపు ప్రజలు ఏదీ అక్కర్లేనట్టు పడి ఉన్నారనిపిస్తుంది. బంగారాన్ని పూడ్చిపెట్టి వెండి వాడుకుంటున్నట్టు ఈ జనం ఉత్కృష్టమైన వన్నింటినీ దాచిపెట్టి, బతుకులో అల్పమైన వాటిని వాడుకుంటున్నారు. ఫర్కువరుడి దేవాలయం కథ దీనికి నిరూపణలా ఉంది. దేనికో భయపడి సుందరమైన దేవాలయాన్ని, దివ్యమంగళ విగ్రహాన్ని మట్టిలో కప్పేసి తమ చేత్తో చేసిన మరో మూర్తిని పూజించి బతుకుదామనుకుంటున్నారు. సత్యాన్ని మరుగు పరిచి భ్రమలో జీవించే ఈ పిరికి బతుకు కన్న సత్యాన్ని మించిన ధ్యేయం లేదు. దాని కోసం నేను చావడానికైనా సిద్ధమేనని ధైర్యంగా పోరాడి ఉంటే రాముడి మూర్తి కాకున్నా, రామతత్త్వం శాశ్వతంగా మిగిలేది— క్రీస్తు పోయినా, అతడి ప్రబోధాలు మిగిలి ఉన్నట్టు. ఈ మాత్రం తెలుసుకోలేకపోయారు ఈ ప్రజలు. మూర్తి పోతుందని దాన్ని నిక్షేపం చెయ్యబోయి, వీళ్ళు సత్యాన్నే నిక్షేపం చేసివేశారు" అన్నాను.

ఎమిలీ తదేకంగా నా వేపే చూసింది. "దీని సంగతి తరవాత మాట్లాడుకోవచ్చు. ఇప్పుడు నేను చెప్పగలిగే దింతే. ఈ దేశప్రజలు ఇప్పుడు మాటులో పడ్డ ఏనుగుల్లా ఉన్నారు. గట్టున ఉన్న మనం వాళ్ళని తక్కువ చేసి మాట్లాడ్డం సహజమే. కాని, అది అంత మంచి లక్షణం కాదు" అంది.

ఎమిలీ స్వభావతః దొడ్డగుణం కలది. అలానే ఆమె మాటకూడా సహజంగా ఉన్నతంగానే ఉంటుంది. ఆమె మాటలు సంపూర్ణంగా ఒప్పు కాకపోవచ్చు. అలాగే మా మాటలుకూడా పూర్తిగా తప్పూకాదు. విమర్శించే మా మాటలకూ, సహనం నిండిన ఆమె మాటలకూ ఇంతే వ్యత్యాసం. ఆమె మాటల్లో తప్పు దొడ్డ మనసు వల్ల వచ్చేది. మా మాటల్లో తప్పు చిన్న మనస్సు లేదా సంకుచిత్వం వల్ల వచ్చేవి. అందుకే నే నామె మాటకు బదులు చెప్పలేదు. ■